## హాస్పిటల్ నిర్వహణలో మేనేజర్ పాత్ర కీలకం


మాట్లాడుతున్న డాక్టర్ నిషాంత్

గుంటూరు ఎడ్యుకేషన్: హాస్పిటల్ నిర్వహణలో మేనేజర్ పాత్ర కీలకమని, రోగ నిర్ధారణ, వైద్యులతో సంప్రదింపుల విషయంలో కీలకంగా వ్యవహరించాలని అమేజ్ హాస్పిటల్స్ కాస్మొటిక్ సర్జన్ డాక్టర్ సాధనాల నిషాంత్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య నిపుణులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నిషాంత్ మాట్లాడుతూ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులంతా ఆయా అంశాల్లో పరిజ్ఞానం సంపాదించాలని ఆయన సూచించారు. కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వహణలో రోగి సంక్షేమం, వసతి అనేవి ముఖ్యమైన విషయాలని తెలిపారు. సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ కె. లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్. వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎస్. మణికంఠ, అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యూని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

**వీసీ ఆచార్య పి. రాజశేఖర్**

ఏఎన్‌యూ: అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఏఎన్‌యూని నిలపడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. 2019 నవంబర్ 4న వైస్ చాన్సలర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లలో తాను సాధించిన విజయాలు యూనివర్సిటీలోని అందరివల్లే సాధ్యం అయ్యాయని తెలిపారు. నాలుగేళ్ల ప్రస్థానంలో 108 గ్లోబల్, 59 నేషనల్ ర్యాంకులను ఏఎన్‌యూ సాధించిందని వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ప్రిన్సిపాల్స్ పి. జాన్సన్, పి. సిద్ధయ్య, ఈ. శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి, సీడీసీ డీన్ కె. మధుబాబు, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ బి. నాగరాజు, పరీక్షల కో-ఆర్డినేటర్ సంధ్యా కోలే పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి రక్ష జగనన్న సురక్ష భరోసా


మందుల కిట్లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్

పట్నంబజారు: ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. నగరంలోని 49వ డివిజన్‌లో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యమే పరమావధిగా వైద్యాన్ని పేదలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కే దక్కుతుందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పశ్చిమ నియోజకవర్గంలో విజయవంతంగా కొనసాగుతున్నట్లు చెప్పారు కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోడపాటి కిశోర్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సుభాని, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్**


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: నగరంలోని ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు వ్యర్థాల్ని తప్పనిసరిగా నగర పాలక సంస్థ ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ)లోనే అన్‌లోడ్ చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.కె భాస్కర్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నగరంలోని ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా సెప్టిక్ ట్యాంకర్లు వ్యర్థాల్ని నగర పరిధిలో బహిరంగంగా కాల్వల్లో, ఖాళీ స్థలాల్లో వేయకూడదని చెప్పారు. సుద్దపల్లి డొంకలో నగరపాలక సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్టీపీలోనే అన్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల్ని వేయడం వల్ల చుట్టుపక్కల వారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ట్యాంకర్ యజమాని వివరాలతో నగరపాలక సంస్థలో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు స్పెషలిస్ట్ అనిల్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవీంద్రనాయక్, పాల్గొన్నారు.

# చిత్తశుద్ధి గల నేత 'చదలవాడ'

**ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి**


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పిరెడ్డి

పట్నంబజారు: రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గుంటూరు అభివృద్ధికి చిత్తశుద్ధితో నడుం బిగించిన నిబద్ధత గల నేత చదలవాడ జయరాంబాబు అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే చదలవాడ జయరాంబాబు వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు రఘు లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో కలసి ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ బలహీనవర్గాలకు చెందిన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన చదలవాడ ప్రజాసేవపై మక్కువతో రాజకీయాల్లో ప్రవేశించి అంచెలంచెలుగా శాసనసభ్యుడి స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో జయరాంబాబు తనయుడు చదలవాడ రఘు, కార్పొరేటర్లు వంగల హేమలత, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సుభాని, విగ్రహ కమిటీ సభ్యులు ఫ్రాంక్లిన్, మిరియాల వీరయ్య, ఇక్కుర్తి రాజారావు, కాకుమాను రత్నరాజు, సూదాని మోహన్ రఘురామ్, ఆలపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేడు గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 'గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం - శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్.హెచ్.ఓ బిల్డింగ్ లో నిర్వహించే వైద్య శిబిరంలో గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గుండం శివశ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ తీస్తామన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పండరీపురం 1వ లైనులో నివసించే సాయికుమార్ కిరాణా కొట్టు నిర్వహిస్తుంటారు. శనివారం ఉదయం తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. సొరుగులోని నల్లపూసల బంగారు గొలుసుతో పాటు రూ. 80వేలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## కుల గణనతో అన్ని వర్గాలకు సమ న్యాయం

నెహ్రూనగర్: రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర కుల గణన ఈ నెలలో జరుపుతామని నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని బీసీ మహాజన సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు నగర్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈనెల 21వ తేదీ తర్వాత సమగ్ర కుల జనగణన చేపట్టాలని నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు.

**నల్లపాడు గ్రామ డి.నెం.142రులో చ.గ॥ 308లు స్థలంనకు బహిరంగ ప్రకటన**

[illegible]

**పసుపులేటి శ్రీనివాస రావు, అడ్వకేట్**
5/1 ..., గుంటూరు. సెల్: 7981296499